“మిమ్మలను చూస్తుంటే నాకు ఒళ్ళు మండి పోతూంది” అంది సుమిత్ర రెండు రేకుల ఇడ్లీలు తిని, కాఫీ గ్లాసు చేతిలోకి తీసుకుంటూ.

“అదేదో మన పెళ్ళి చూపుల రోజునే జరిగితే బాగుండేది కదా” అన్నాడు మనోహరరావు.

మనోహరరావు నాలుగు నెలల కిందట సుమిత్ర మెడలో మూడు ముళ్ళు వేశాడు. చిక్కడపల్లిలో ఒక పోర్షను అద్దెకు తీసుకుని ముచ్చటగా మూడు నెలల కిందట కాపరం పెట్టాడు.

ఈ మూడు నెలలుగా వాళ్ళిద్దరి మధ్య ఎలాంటి కంప్లెయింటు లేదు. ఎండ వాన, గాలి వెలుతురు, ఈగలు దోమలు మొదలైన వాటి ఉనికినికూడా గ్రహించలేనంత “బిజీ” గా ఉండి పోయారు.

“నో జోక్స్. అయామ్ సీరియస్” అంది సుమిత్ర, నిజమైన కోపంతో.

“కోపంలో ఈ దీనుణ్ణి శపించేలా ఉన్నావు. అలా అయితే మరు జన్మలో కూడా మీరే నా భర్త అగుదురు గాక అని శపించు. ఇంతకీ నా అపరాధ మేమిటో?”

సుమిత్ర మాట్లాడకుండా తన కుడి చేత్తో పైనున్న అటకని చూడమన్నట్టుగా సంకేతం చేసింది.

మనోహరరావు తల పైకెత్తి అటక మీదికి చూశాడు. దానిమీద ఊరగాయ జాడీలు, రెండు సూటు కేసులు, పాత వార్తాపత్రికల కట్ట, ఇంకా ఇతరములు ఎన్నో చోటు చేసుకున్నాయి.

తన కేమీ అర్థం కాలేదన్నట్లుగ అయోమయంగా మొహం పెట్టాడు అతను.


“నేను కాపరానికి వచ్చినప్పటి నుంచి ఆ చిత్తు కాగితాల కట్ట అలాగే ఉంది. దాన్ని అమ్మెయ్యకూడదూ—ఇంట్లో అడ్డం కాకపోతే” అంది సుమిత్ర అప్పటికి తను కాపరానికి వచ్చి పది సంవత్సరాలు అయినట్టుగా.

“రాణిగారి అజ్ఞ. అటులైనచో వాటిని నే నిప్పుడే పంపెదను గాక” అంటూ స్టూలు మీద ఎక్కి అటక మీదనుంచి ఆ కాగితాల కట్ట తీసి దబీమని కింద పడేశాడు.

అటు తిరిగి నిలుచున్న సుమిత్ర ఆ శబ్దానికి ఉలిక్కి పడింది. మనోహరరావు మందహాసం చేశాడు.

పాత కాగితాలలో పనికొచ్చేవి ఉండవచ్చుని ఒక్కొక్క కాగితం తీసి సార్ట్ అవుట్ చేయసాగాడు.

“ఏమిటండోయ్ ఈ ఉత్తరాలు! కొంప తీసి మన పెళ్ళికి ముందు మీ ప్రియురాలు వ్రాసిన ప్రేమలేఖలు కాదు



# మిథ్యాబింబం

'మిర్రర్'

“భర్త శీలాన్ని నిష్కారణంగా శంకిస్తే కళ్ళు పోతాయి—జాగ్రత్త.”

“అవ్వా! అయితే పెళ్ళికి ముందు మీరు ఈ చెత్తంతా చదివేవారన్నమాట” అంది సుమిత్ర కొన్ని పాత సెక్సు పత్రికలు బయట పెడుతుంటే.

“అబ్బే, అవి నా రూమ్మేటువి. నే నెప్పుడూ చదవలేదు” అంటూ కంగారు పడిపోయాడు అతను.

“మై డియర్ సార్! పెళ్ళికి ముందు ఫామిలీ ప్లానింగ్ గురించి ఎందుకు చదవ వలసి వచ్చింది” అంది సుమిత్ర ‘ఫామిలీ ప్లానింగ్ మేడ్ ఈజీ’ అన్న పుస్తకం బయటకు లాగుతూ.

“అబ్బే! నా రూమ్మేటు ఒకడుండే వాడులే—వాడుట్టి వెధవ.”

“రూమ్మేటు అంటా రేమిటి దీని మీద మీ పేరు వ్రాసి ఉంటే...”

“అదా...అదీ...అదీ వాడే రాశాడు.”

“నాన్సెన్స్. ప్యూర్ నాన్సెన్స్ తప్ప పనికొచ్చే పుస్తకం ఒక్కటి లేదు మీ దగ్గర” అంది సుమిత్ర, లెడ్జరులో పేజీలు తిరగేస్తూ అబ్జక్షన్ రెయిజ్ చేసే ఆడిటర్ లాగా.

మనోహరరావు నోరెత్త లేదు, ఏం కొంప మునుగుతుందో అని.

“వెరీగుడ్. ఈ ఆర్టికల్ చూడండి”. అంది ఒక పాత వారపత్రికలో ప్రచురించ బడ్డ వ్యాసం అతనికి చూపిస్తూ.

“పిల్లలను పెంచటం ఎలా” అన్న శీర్షిక కింద వారం వారం ప్రచురించ బడుతున్న ప్రముఖ రచయిత్రి స్వర్ణలత గారి ‘సలహాలు, సూచనలు.’

“అలు లేదు, చూలు లేదు అన్నట్టు ఉంది నీ వ్యవహారం. ఇప్పటినుంచే మనకి ఇదంతా ఎందుకు? కొన్నాళ్ళు ఇలా సాగనీ” అన్నాడు మనోహరరావు తిరిగి పుస్తకం ఆమెకు అందిస్తూ.

“నో, నో. ఇవి ఎప్పటికైనా ఉపయోగ పడతాయి. ప్రతి ఒక్కరికీ పిల్లల పెంపకం గురించి తెలిసి ఉండటం మంచిది” అంటూ ఆ వ్యాసంలోని అంశాలు అక్కడక్కడ చదవసాగింది.

‘పిల్లలు చెప్పిన మాటలు వినటం లేదని పెద్దలు కొడుతూ ఉంటారు. అది చాలా తప్పు. అలా కొట్టటం పిల్లల మనస్సుపై చెడు ప్రభావం కలగ చేస్తుంది.’

“అవునండోయ్. మా నాన్న చిన్నప్పుడు మమ్మలను చచ్చేట్టు బాదే వాడు.”

‘దెబ్బలు తిన్న బాలుడు తల్లితండ్రులపై అనురాగానికి బదులు భయాన్ని పెంచుకుంటాడు.’

“నిజమే. మా నాన్న అంటేనే మాకు ఇప్పటికీ భయమే.”

‘పిల్లలు ఏదైనా కావాలని కోరి నప్పుడు అందుబాటులో ఉంటే వెంటనే

శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కృప పొందిన

"యోగి యాదవ్"

ఆర్యా,

మీ నిత్య జీవితంలో తీరని సమస్యలను తమ యొక్క యోగ శక్తితో జయింప చేసి మిమ్ములను ఆశ్చర్య చకితులనుగా చేస్తారు.

అనేక ఉన్నత అధికారులు, అభిమానులు "యోగి యాదవ్" విశేష యోగకృపచే కష్టముల నుండి విముక్తులయినారు.

మీ మనస్సును క్లేశ పరచు సమస్యలలో ఒక్క ప్రశ్నను వివరంగా వ్రాసి 'మీ' ఇంటి విలాసము 90 పైసల తపాలాబిళ్ళలతో ఈ క్రింది విలాసమునకు పంపిన యెడల మీ సమస్యలు తీరు విధమును "యోగి యాదవ్" వివరముగా తెలియజేస్తారు. "యోగి యాదవ్" గారికి పెద్ద పెద్ద అధికారులు పంపిన 'సర్టిఫికేట్లు' (Certificates) యొక్క కాపీ మీకు పంపబడును.

విలాసము :

"యోగి యాదవ్"

57, పళనియప్ప నగర్, మద్రాసు-600087.

N.B. మీ ప్రశ్నను ఆంగ్లములో మాత్రమే వివరంగా వ్రాసిపంపవలయును.

గత ఇరవై సంవత్సరాలుగా తన రచనలతో పాఠకులను అలరిస్తున్న అగ్రశేణి రచయిత్రి శ్రీమతి అరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి రచన.

అనామిక (డైరక్టు నవల) త్వరలో విడుదల.

| డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ రచన | శ్రీమతి తెన్నేటి గద్ద లలితా దేవి రచన |
| --- | --- |
| శ్రీలేఖ ('విజయ' మాసపత్రిక సీరియల్) రు. 22-00 | విష్ణుమాయ రు. 16-00 (ఆంధ్రజ్యోతి సీరియల్) |

మీ దగ్గరలోని బుక్ షాపులలో అడగండి లేదా మాకు వ్రాయండి.

వివరములకు :

వాహిని పబ్లిషింగ్ హౌస్

ఏలూరు రోడ్డు, విజయవాడ-2

ఫోన్ నెం : 73686.

VTS/V/82

ఇచ్చి వారి కోరికలను తీర్చాలి. లేకపోతే తీరని కోరికలతో చిన్నప్పటి నుంచీ మానసికంగా అసంతృప్తికి గురి అవుతారు.'

"కరెక్ట్. నేను మా అమ్మ దగ్గిరే పడుకుంటా నని చిన్నప్పుడు పేచీ పెట్టేదాన్ని. మా నాన్న కోప్పడి నన్ను, తమ్ముడిని వేరే రూములో పడుకో మనే వాడు. నాకు చాలా బాధ వేసేది" అంటూ సుమిత్ర క్రీకంటితో భర్తని చూడ సాగింది.

'పిల్లలు తప్పుచేస్తే వెంటనే దండించ కూడదు. వాళ్ళ చేసింది తప్పు ఎలాగో వాళ్ళకు తెలిసేలా మళ్ళీ మళ్ళీ చెప్పాలి.'

"ఏమండోయ్! ఈశీర్షిక కింద ఇది చివరి వ్యాసం. గత పదిహేను వారాలుగా ప్రచురించ బడ్డ ఈ శీర్షిక ముగిసింది అని వ్రాసి ఉంది. అంటే ఇంతకు ముందు పదిహేను వ్యాసాలు వచ్చాయన్న మాట.

మనోహరరావు వింటున్నాడు.

"ఏమండీ! దీనికి ముందు వచ్చిన పదిహేను సంచికలు దొరుకుతాయేమో వెతకండి".

మనోహరరావు వెతకసాగాడు.

"వచ్చే వారం నుంచీ వంట ఇల్లు అందంగా ఉంచుకోవటం ఎలా, అతిథులను సంతోష పెట్టేందుకు గృహిణి తీసుకోవలసినజాగ్రత్తలు, భర్తను మంచి మార్గంలో నడిపించడంలో భార్య తెలుసుకోవలసిన అంశాలు—ప్రముఖరచయిత్రి స్వర్ణలత గారి వ్యాసాలు ప్రచురించ బడతాయి."

"ఏమండీ! అబ్బ! ఇన్నిమంచివ్యాసాలు వ్రాసింది స్వర్ణలత. కానీ ఒక్కటే చదవలేక పోయాను. మీరు ఎలాగైనా ఈ పత్రిక పాత సంచికలు సంపాదించాలి" అంది సుమిత్ర.

"ఎప్పుడో రెండేళ్ళ నాటిది. అంత పాతవి ఇప్పు డెక్కడ దొరుకుతాయి?"

"అన్నట్టు, గుడ్ఐడియా! ఇలాంటి వ్యాసాలు అన్నీ సంకలనం రూపంలో ఎప్పుడో వచ్చేసి ఉంటాయి. మిగిలినవి ఎలా ఉన్నా కనీసం 'పిల్లల పెంపకం' గురించిన పుస్తకం కావాలి. బుక్‌షాప్‌లో అడిగితే చెబుతారేమో!"

"పిల్లల పెంపకం గురించి బోలెడు పుస్తకాలు ఉంటాయి. ఏదైనా కొనుక్కోవచ్చు."

"అలా కాదు. స్వర్ణలత గారి రచనే కావాలి. ఆవిడ ఎంతో అనుభవంతో ఒక తల్లిగా, పిల్లల పట్ల బాధ్యతను గుర్తించి వ్రాసి ఉంటుంది."

"అలాగే "అన్నాడు మనోహరరావు.

• • •

"ఏమండోయ్! గుడ్ న్యూస్" అంది సుమిత్ర మనోహరరావు ఆఫీసు నుంచి రాగానే.

"ఏమిటి? అప్పుడేనా!" అంటూ దిగులుగా, కంగారుగా గోడ కున్న కాలెండరులో బాబు కేసి చూడసాగాడు.

అప్పుడే పిల్లలు కలగటం అతని కిష్టం లేదు.

"ఛా! ఛా! అదేం కాదు!"

గ్రేట్ రిలీఫ్.

"మరి..."

"స్వర్ణలతగారి పుస్తకాల కోసం మనం ఇన్నాళ్ళు వెతుకుతుంటే దొరక లేదు కదూ!"

"అవును. ఇవాళ ఏ షాపులోనైనా దొరికాయా?"

"పుస్తకాలు దొరకలేదు. స్వర్ణలత గారే దొరికారు."

"నిజమా! ఎలా?"

"మా క్లాస్‌మేట్ సునంద అని ఉండేది. తను ఇందాక బజారులో కనిపించింది. చాలాకాలం తరవాత కలిసింవేమో. ఇంటికి కూడా రమ్మంటే వెళ్ళాను. వాళ్ళ ఇక్కడే అశోక్‌నగర్‌లో ఉంటున్నారు."

"ఆవిడే స్వర్ణలతా?"

"కాదు. వీళ్ళుంటున్న బజారులోనే నాలుగిళ్ళ అవతల స్వర్ణలతగారు ఉంటున్నారు."

"నిజమా!"

"నిజంగానే. అంతేకాక ఆవిడ మా సునందకి కూడా పరిచయమేనట."

"అయితే ఇంకేం?"

"వచ్చే ఆదివారం మనం స్వర్ణలతగారి ఇంటికి వెళ్దామండి. ఆవిడ నా అభిమాన రచయిత్రి. ఆవిడను చూసినట్టు ఉంటుంది. అంతేకాక పిల్లల పెంపకం గురించి ఆమె వ్రాసిన వ్యాసాలు పూర్తి సెట్ ఒకటి అడిగి తెచ్చుకుంటాను."

"సరే. అలాగే వెళ్దాం."

"ఏమండీ! మన బాబిగాడిని సరిగ్గా స్వర్ణలతగారి సూచనల ప్రకారం పెంచాలండీ" అంది సుమిత్ర గారాబం పోతూ.

"అదిగో—అప్పుడే పిల్లలా?"

"ఇప్పుడంటే ఇప్పుడు కాదు. పుట్టినప్పుడు."

• • •

ఆదివారం వచ్చింది.

సాయంకాలం చల్లబాటునేసుమిత్ర, మనోహరరావు సునందను తోడు తీసుకుని స్వర్ణలతగారి ఇంటికి బయలుదేరారు.

సుమిత్రకి తనఅభిమాన రచయిత్రిని చూడబోతున్నందుకు గొప్ప థ్రిల్లింగ్‌గా ఉంది. తన కుటుంబంలో ముందు

ముందు ఏమైనా సమస్యలు వస్తే స్వర్ణలతను సంప్రదించవచ్చు అను కుంటూ మురిసిపోసాగింది.

ఇంతలో వాళ్ళు ఒక డాబా ఇంటి ముందు చేరుకున్నారు.

బయట గేటుకు స్వర్ణలత నేమ్ ప్లేట్ వేళ్ళాడుతూంది. పేరు చివర డిగ్రీలు కానీ, చేసే ఉద్యోగం యొక్క పదవీ వివరణ కానీ ఏదీ లేదు. కనీసం తెలుగు రచయిత్రి అన్న ముక్క కూడా చేర్చబడి లేదు.

ఇదంతా ఆమె నిరాడంబరతకి సూచనగా భావించింది సుమిత్ర.

గేటు తెరిచి లోపలికి ప్రవేశించారు.

ఇంటిముందు మెట్ల మీద ఒక ఆరేళ్ళ బాబు, నాలుగేళ్ళపాప యుగళంగా ఏడుస్తున్నారు.

''బాబూ! ఎందు కేడుస్తున్నారు'' అంది సునంద.

''అమ్మ కొట్టింది'' అంటూ ఏకకంఠంతో జవాబు చెప్పారు.

ఇదంతా చూస్తున్న సుమిత్రకి విచిత్రంగా తోచింది. స్వర్ణలత పిల్లలను కొట్టటమా! అందునా వాళ్ళు ఏడుస్తుంటే అలా వదిలేసి ఊరు కోవటం? మరి ఆమె రచనలలోని సూచనలు?

ఇంతలో—''వెధవ సంతానం — నా ప్రాణానికి రాక్షసులు పుట్టారు. ఒక్కడూ చెప్పినమాట వినడు కదా! ఇల్లు ఒకనరకం చేసి పెట్టారు'' అంటూ లోపలి నుంచి విసుగుతో కూడిన స్వరం.

''నేను లోపలికి వెళ్ళి చూస్తాను'' అంటూ సునంద లోపలికి వెళ్ళింది.

''ముందుగా ఎపాయింటుమెంటు తీసుకోకుండా పెద్దవాళ్ళ దగ్గరకు రాకూడదు'' అన్నాడు మనోహరరావు సుమిత్ర చెవిలో.

''అక్కయ్యా! ఏమిటి గొడవ? బావగారు లేరా?''

లోపలి నుంచి సునంద గొంతు.

''ఆదివారంకదా — పొద్దునవగా పేకాటకని వెళ్ళారు. ఇక అర్ధరాత్రే తిరిగి రావటం.''

''పిల్లలు ఏడుస్తున్నారు. ఎందుకు?''

''ఏముంది—మామూలే. ఇద్దరూ చేరి ఫ్లాస్కు పగలకొట్టారు. మొన్ననే యాభై రూపాయలు పెట్టి తెచ్చారు. ఇద్దరికీ రెండు అంటించేసరికి ఏడుస్తూ కూర్చున్నారు.''

బయట సుమిత్ర, మనోహరరావు మొహమొహాలు చూసుకున్నారు.

''అన్నట్టు మా ఫ్రెండ్ నిన్ను చూడాలని వచ్చింది. బయట నిలబడి ఉన్నారు.''

''మరి ఇంకా చెప్పవేం?''

మరుక్షణం ఒక ఇరవై ఎనిమిదేళ్ళ స్త్రీ బయటకు వచ్చింది. వెనకాం సునంద.

పరిచయాలు, తరవాత యోగ క్షేమాలు, ఆ పైన కాఫీ, టిఫిన్లు అయ్యాయి.

''ఈ మధ్య మీ రచనలు మళ్ళీ రావటం లేదు'' అంది సుమిత్ర.

''ఏదీ. ఈ రాక్షసులు పుట్టుకొచ్చారు. రాయడానికి వీలు కావడం లేదు'' అంటూ ఒడిలో చేరిన ఇద్దరు పిల్లలను ముద్దు పెట్టుకుంది స్వర్ణలత.

క్షణం ముందు కొంప మునిగినట్టు ఏడుస్తున్న పిల్లలు ఇప్పుడు హాయిగా నవ్వుతున్నారు.

సుమిత్రకి ఎన్నో సందేహాలు.

రచయిత్రి అంటే ఏ యాభై ఏళ్ళుఉంటా యనుకుంది. కానీ తనకంటే ఒక అయిదేళ్ళు మాత్రమే పెద్దది అయిన స్వర్ణలత పట్ల సుమిత్రకి ఆరాధనా భావం కొంచెం తగ్గింది.

''పిల్లల పెంపకం'' పుస్తకంలో అలా వ్రాసి తను ఇప్పుడు పిల్లలను కొడుతుందేమిటి? ఎలా అడగటం?

''మీ రచనలు చాలా సహేతుకంగా, వాస్తవానికి దగ్గరగా, విజ్ఞానదాయకంగా ఉంటాయి. నా అభిమాన రచయిత్రులలో మీరు ఒకరు'' అంది సుమిత్ర.

స్వర్ణలత మొహంలో కృతజ్ఞతా భావం.

''అన్నట్టు 'పిల్లలను పెంచటం ఎలా' అన్న మీ వ్యాసాలు ప్రతి తల్లి చదవదగ్గవి. అవి బజారులో దొరకటం లేదు. మీ వద్ద ఉంటే ఒక కాపీ తీసుకువెళ్ళాంని ఉంది'' అంది సుమిత్ర అసలు విషయం బయటపెడుతూ.

''మొన్నటిదాకా కొన్ని కాపీలు ఉండేవి. ఇదిగో—ఈ రాక్షసులే చింపి పాడు చేశారు'' అంది గోముగా బాబిగాడి నెత్తిమీద చిన్న దెబ్బ వేస్తూ.

''అయ్యో! ఎలాగండి? ఎక్కడా దొరకటం లేదు'' అంటూ సుమిత్ర బాధ పడసాగింది.

''అయినా, అవెందుకు పనికొస్తా యమ్మా నీకు? నాకు పెళ్ళి అయిన కొత్తలో ఆయన ఆఫీసుకి వెళ్ళిన తరవాత కాలక్షేపం అయ్యేది కాదు. అప్పట్లో పిల్లలు పుట్టలేదు. ఏమీ తోచక రోజూ వ్రాసి పత్రికకు పంపేదాన్ని.''

స్వర్ణలత మాటలకు సుమిత్ర కొయ్యబారిపోయింది. ఆమె కాలక్షేపం కోసం వ్రాసినవే కానీ, శాస్త్రీయ దృక్పథంతోనూ, అనుభవంతోనూ వ్రాసి నవి కావన్న మాట.

''కానీ అవి పబ్లిష్ అయింది రెండు ఏళ్ళ కిందటే కదా?''

''నిజమే. వీస్పుడో వీడు పుట్టక ముందు ఏడేళ్ళ కిందట వ్రాస్తే, వరసగా సీరియల్‌గా మొన్నటివరకూ ఆ పత్రికవారు అప్పుడు కొన్ని, అప్పుడు కొన్ని వేశారు.''

''పోనీ ఆ పత్రికలవారిని మీరు అడిగితే పాత సంచికలు ఇస్తారేమో!'' సుమిత్రకి ఇంకా ఆ వ్యాసాల మీద మక్కువ పోలేదు.

''చూడండి. మీరు మా సునంద ఫ్రెండ్ కాబట్టి ఫ్రాంక్‌గా చెబు తున్నాను. పిల్లలను పెంచడానికి పుస్తకాలు చదవ నవసరం లేదు. మాతృత్వం పొందిన ప్రతి స్త్రీకి ఒకరు చెప్ప నవసరం లేకుండానే తన పిల్లలను ఎలా పెంచాలో తెలిసిపోతుంది. తల్లికీ, బిడ్డకీ మధ్య మరొకరికి స్థానం ఉండదు...ఉండకూడదు. బిడ్డ ఎందు కేడుస్తుంది, ఎందుకు నవ్వుతుంది, ఎంత ఆకలి అయింది, ఎన్ని పాలు ఇవ్వాలి మొదలుకొని సర్వ విషయాలు తల్లికి తెలిసిపోతాయి. ఆ తరవాత తనకున్న ఆర్థిక వనరులు, సమాజంలో కట్టుబాట్లు అనుసరించి ప్రతి తల్లి పిల్లలను పెంచుకోగలుగుతుంది. దీనికి వేరే పుస్తకాలు చదవ నవసరం లేదు. ఇది నా అనుభవం'' అంది స్వర్ణలత.

''పోనీ వంట ఇల్లు అందంగా ఉంచుకోవటం ఎలా?' అన్న పుస్తకం...''

ఈసారి స్వర్ణలత పెద్దగా నవ్వేసింది.

''జీవితమే ఒక పెద్ద పుస్తకం. మీ ప్రతి అనుభవం పుస్తకంలోని ఒక్కొక్క పేజీలాంటిది. కాబట్టి వంట ఇంటి అందం గురించి కూడా పుస్తకాలు చదవటం అనవసరం. అంతేకాదు. కామ సూత్రాలు ప్రక్కన పెట్టుకుని దాంపత్యం నెరవేర్చటం, వ్యాసాలు చదివి పిల్లలను పెంచటం, పుస్తకం చూసి వంట వండటం ఆరోగ్యానికి మంచిది కాదు'' అంది స్వర్ణలత.

ఆమెతోపాటు మిగిలిన ముగ్గురూ నవ్వులో పాలు పంచుకున్నారు.

''అప్పుడప్పుడూ వస్తూ ఉండండి'' అంది స్వర్ణలత గేటు వరకూ వచ్చి.

''ఏమండీ! 'పిల్లలు పాడు చేసిన వస్తువులు బాగు చేసుకోవటం ఎలా?' అన్న శీర్షికతో వ్యాసాలు వ్రాస్తాను'' అంది సుమిత్ర దారిలో నవ్వుతూ.

మనోహరరావు మందహాసం చేశాడు.

★

రాచకొండ విశ్వనాథశాస్త్రి
రచనలు వెలువడ్డాయి!

| | |
|---|---|
| అల్పజీవి | 10.00 |
| ఆరు సారా కథలు | 5.00 |
| ఋక్కులు | 10.00 |
| గోవులొస్తున్నాయి | 10.00 |
| రాజు-మహిషి | 10.00 |
| సొమ్ములు పోనాయండి | 6.00 |
| రత్తాలు-రాంబాబు (1,2,3,4 భాగాలు) | 33.00 |
| తిరస్కృతి (నాటకం) | 3.00 |

పుస్తకం ఖరీదు M.O. చేయండి.
పోస్టు ఖర్చు V.P. పెడతాము!
ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్. విజయవాడ-2